క్లుప్తంగా

కృత్రిమ కాలు ఉచితంగా అందజేసిన ఎమ్మెల్యే

నందిగామటౌన్: పట్టణంలోని ఐదవ వార్డుకు చెందిన బండారు ప్రసాద్‌కు కస్తాల మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.40 వేలు విలువ చేసే కృత్రిమ కాలును సోమవారం శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ తన తల్లి కస్తాల మరియమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు తాను, తన సోదరుడు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అండగా ఉంటామన్నారు. బండారు ప్రసాద్ ఇటీవల మధుమేహ వ్యాధితో బాధపడుతుండటంతో వైద్యులు కాలు తీసేశారని, కృత్రిమ కాలు అందించి ఆదుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులు తమ దృష్టికి తీసుకురావడంతో తాము తమ ట్రస్ట్ ద్వారా కృత్రిమ కాలును అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు బండారు ప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

వీరులపాడు: బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీఎం యెహోషువా అన్నారు. వీరులపాడు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలను అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శరవేగంగా చెరువు అభివృద్ధి పనులు



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే నిమిత్తం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఊర చెరువు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలో చేపట్టిన చెరువు సుందరీకరణ పనులను సోమవారం పలువురు కౌన్సిలర్లతో కలసి ఆయన పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లలకు, పెద్దలకు పార్కు వంటివి అధునాతన పద్ధతిలో నిర్మాణాలు చేపట్టారని, త్వరలోనే ఊర చెరువును ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, తన్నీరు నాగేంద్ర, మున్సిపల్ ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు



జగ్గయ్యపేటఅర్బన్: శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు సోమవారం రాత్రి స్థానిక శ్రీముత్యాలమ్మ ఆలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రకాల రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ నృత్యాలు, కోలాటాలతో అలరించారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు



పెనుగంచిప్రోలులో శ్రీగాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు



గౌరవరంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



నందిగామలో గాయత్రీ దేవిగా పూజలు అందుకుంటున్న వాసవి అమ్మవారు



పేటలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అల్లూరు గ్రామంలోని మహాలక్ష్మీ అమ్మవారు



నందిగామలో బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన శుక శ్యామలాంబ అమ్మవారు

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాలు రెండవ రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఉమాపతి, పలువురు దంపతులు పాల్గొన్నారు. తూర్పు బజారులో ఏర్పాటు చేసిన దుర్గా మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారికి గాయత్రీ దేవి అలంకరణలో భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. బీసీ కాలనీలోని రామాలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొణకంచి శివాలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో దసరా ఉత్సవ పూజల్లో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు..

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారు రెండవ రోజు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గౌరవరం, బలుసుపాడు, ధర్మవరప్పాడుతండా, జయంతిపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు అర్చకులు గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవరోజు సోమవారం పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో వేదపండితులు మహంకాళి రామప్ప ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి శ్రీచండీ మూలమంత్ర సహిత రుద్రహోమం నిర్వహించారు. గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అద్దాలబజారులో శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ఉదయం కుంకుమపూజలు, శ్రీచండీహోమం నిర్వహించారు. శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అద్దాలబజారులో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంతో పాటు పలు అమ్మవారి ఆలయాలలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరు భాస్కరరావు, అంజనాదేవి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో ఆర్యవైశ్య సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

వత్సవాయి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, చిట్టేల, కంభంపాడు, లింగాల, మక్కపేట, భీమవరం, మంగొల్లు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేశారు. రోజూ రెండు పూటలా దంపతులు పీటలపై కూర్చుని అమ్మవారి పూజాకార్యక్రమాలను చేస్తున్నారు. అమ్మవారి మండపాల వద్ద రాత్రి సమయాల్లో మహిళలు రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆడి పాడారు.

బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజైన సోమవారం పలువురు అమ్మవార్లు బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని శుక శ్యామలాంబ అమ్మవారు, మండలంలోని అంబారుపేటలో శ్రీ సత్యమ్మ అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వగా, మరిడి మహాలక్ష్మి అమ్మవారు కాత్యాయినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. పల్లగిరి గట్టుపై గల త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ అమ్మవారు మంగళ గౌరిగా కొలువుదీరారు. పట్టణంలోని దుర్గానగర్‌లో గల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్లలో, మండల పరిధిలోని పలు గ్రామాల్లోని మండపాల్లో ఏర్పాటుచేసిన అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకొని బతుకమ్మల సంబరాలు సందడిగా సాగుతున్నాయి.

ఇంటి వద్దనే వైద్యం.. విప్లవాత్మక నిర్ణయం

జేఏఎస్ శిబిరంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రభుత్వ వైద్యులు ఇళ్ల వద్దకు వచ్చి పరీక్షలు చేసి వైద్య సేవలందించటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే చూస్తున్నామని, ఇది విప్లవాత్మక నిర్ణయమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చందాపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు ఇళ్ల వద్దకు వచ్చి పరీక్షలు చేసి వైద్య సేవలందించి, మందులు కూడా ఉచితంగా ఇవ్వడం చరిత్రలో ఎన్నడూ చూడలేదని చెప్పారు. నిరుపేదలకు వైద్యం చేరువ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా సకల వసతులతో ఆధునీకరిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరుమామిళ్ల చందన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల కిరణ్, వైఎస్ఎన్ ప్రసాద్, పలువురు నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు. అనంతరం తోటరావులపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సర్పంచ్ ములకలపల్లి లక్ష్మితో కలసి ప్రారంభించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి రోగులకు మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, ములకలపల్లి కృష్ణమోహన్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైద్యారోగ్య సిబ్బంది, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ చర్యలు

వెల్లంకి(వీరులపాడు): ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించారన్నారు. వారిలో అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో ఆయా విభాగాల స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలందిస్తారన్నారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆయన పరిశీలించి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్‌లు షేక్ హుసేన్‌బీ, గద్దె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు వేమిరెడ్డి కోటేశ్వరి, వైద్యాధికారులు దీపిక, గౌతమ్, ఎంపీడీవో అరుంధతీ దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, నరేందర్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.



చందాపురం ఆరోగ్య సురక్ష శిబిరంలో కళ్లజోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కీసరలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం

కీసర(కంచికచర్ల): ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కీసర గ్రామ సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ తరహాలో నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలనేదే సీఎం తపన అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మునగ ఆకుతో తయారు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సర్పంచి పేరం నర్సమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యురాలు పాపట్ల సీత, మాజీ సర్పంచులు పరిటాల వీరభద్రరావు, పరిటాల దివ్య, నాయకులు వేల్పుల రమేష్, పరిటాల రాము, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్, గ్రామ సచివాయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

వేమవరం/ఆళ్లూరుపాడు(వత్సవాయి): జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని సర్పంచ్ యలమర్తి నరేంద్ర తెలిపారు. సోమవారం ఆళ్లూరుపాడు, కొత్త వేమవరం, పాత వేమవరం గ్రామాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పై గ్రామాల్లో 300 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్, పీఆర్ ఏఈ సుందరరామయ్య, నాయకులు మాదాల వీరయ్య చౌదరి, ఎస్.వెంకటేష్, కందుల త్రివేణి, పంచాయతీ కార్యదర్శి భానునాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు జవహర్‌లాల్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతకు సీఎం భరోసా

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం భరోసాగా నిలుస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఏగా పనిచేస్తూ ఆదివారం మృతి చెందిన సంకు సురేష్ మృతికి మౌనం పాటించారు. అనంతరం శిబిరంలో రోగులకు ఉచితంగా పరీక్షలు చేయటంతో మందుల కిట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ వారు పోషకాహారంపై స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి, వైద్యులు పి.ఇందిర, అరుణ, వాసంతి, రమేష్, గ్రామ నాయకులు గూడపాటి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగన్

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పాతకంచల గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): లక్షలాది మంది నిరు పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామ శివారు పాత కంచల, ముప్పాళ్ల గ్రామాల్లో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామన్నా ప్రతిపక్ష పార్టీలు కోర్టులకు వెళ్లి అడ్డుకున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుపడినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచి మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు పెమ్మసాని నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నల్లాని సాయి, బండారుపల్లి కపిల్, నల్లాని అయ్యన్న, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పేట బాలికల హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో మంగళవారం 10 వ నంబరు సచివాలయం పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భసంచి సంబంధిత వ్యాధులకు, గుండెకు సంబంధించిన పరీక్షలు, పిల్లల వ్యాధులు, కంటి పరీక్షలు తదితర మొత్తం 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారన్నారు.

నేడు అనిగండ్లపాడులో

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): అనిగండ్లపాడు సచివాలయం-2 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నందిగామలో

నందిగామ: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని 17 ,18 వార్డులకు సంబంధించి పట్టణ శివారు డీవీఆర్ కాలనీలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు పరిటాలలో

కంచికచర్ల: పరిటాల-2 గ్రామ సచివాలయం పరిధిలో ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ కానూరు శిల్ప తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ అరుణకుమార్



నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు సైతం ఆకర్షితులవుతున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి అరుణకుమార్ సమక్షంలో వీరులపాడు మండలం జమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మంగళపూడి శ్రీను, సేవ ద పీపుల్స్ సంస్థ ఫౌండర్ కొనకాల సాయికుమార్‌తో పాటు పార్టీలో చేరిన పలువురికి ఆయన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, గ్రామ కన్వీనర్ నన్నెబోయిన తిరుమలరావు, కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

గంద్రాయి(జగ్గయ్యపేట): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి అన్నారు. గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, ఏఎంసీ డైరెక్టర్ నరసింహారావు, వైద్యాధికారులు అనిల్ కుమార్, నాగరాణి, స్రవంతి, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.